www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 ఆగస్టు 2023
5
ఏలూరు



నేడు ఉద్యోగులకు ప్రత్యేక స్పందన
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు
జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఫిర్యాదులు, సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్లలో ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సర్వీస్, వ్యక్తిగత, ఇతరత్రా ఫిర్యాదులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

నత్తనడకన గృహ నిర్మాణం..!

రెండు జిల్లాల్లో లక్షా 70 వేల ఇళ్లు మంజూరు
ఇప్పటి వరకూ పూర్తయినవి 47,332 మాత్రమే
ఇంకా లక్షా 22 వేల అసంపూర్ణంగానే
ఎన్నికలలోపు పూర్తయ్యే ఇ ళ్లెన్నో
రెగ్యులర్ హౌసింగ్ పీడీ లేక ఏలూరు జిల్లావాసుల అవస్థలు


జిల్లాలో పూర్తికాని జగనన్న ఇళ్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
రెండు జిల్లాల్లోనూ పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ప్రతి పేదవానికీ ఇల్లు నిర్మిస్తామన్న ప్రభుత్వ హామీ ముందుకు సాగడం లేదు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు దాటిపోయింది. ఇప్పటి వరకూ మంజూరు చేసిన ఇళ్లకు.. నిర్మాణం పూర్తయిన ఇళ్లకూ ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. మరో ఎనిమిది నెలల్లోపు సాధారణ ఎన్నికలు జరిగే పరిస్థితి ఉంది. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చెబుతున్న పథకాల్లో గృహనిర్మాణం ఒకటి. అలాంటి పథకాన్ని పర్యవేక్షించేందుకు ఏలూరు జిల్లాలో గృహనిర్మాణశాఖకు రెగ్యులర్ పీడీ కూడా లేకపోవడం గమనార్హం. ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లో మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్ల నిర్మాణాల లెక్కలు పరిశీలిస్తే ఈ పథకం ఎంత నత్తనడకన సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఏలూరు జిల్లాలో 28 మండలాలు ఉండగా వైఎస్ఆర్ జగనన్న కాలనీలు, పిఎంఎవై గృహనిర్మాణాల కింద 98,874 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్లు మాత్రం 23,181 మాత్రమే. ఇంకా 75,693 ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని దుస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాలు ఉండగా 71,283 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్లు 24,151 మాత్రమే. ఇంకా 47,132 ఇళ్లు అసంపూర్తిగానే ఉన్నాయి. దీన్నిబట్టి రెండు జిల్లాల్లోనూ పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పథకం ఎంత నత్తనడకన సాగుతుందో స్పష్టమవుతోంది. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ముందుకు సాగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. అనేక చోట్ల ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాలు గృహ నిర్మాణాలకు అనుకూలంగా లేని పరిస్థితి నెలకొంది. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన ఇప్పటికీ పూర్తికాకపోవడం అతిముఖ్యమైన కారణంగా లబ్ధిదారులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ము ఏమాత్రం సరిపోకపోవడం ప్రధాన కారణంగా కన్పిస్తోంది.

రూ.లక్షా 80 వేలతో ఇల్లు పూర్తవుతుందా..?
ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం చేస్తున్న సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. ఈ సొమ్ములు పునాదుల దశకు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. సిమెంట్, ఐరన్, ఇసుక వంటి ధరలు ఆకాశంలో ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన సెంటున్నర స్థలంలో ఇల్లు నిర్మించాలంటే తక్కువగా లెక్కించినా దాదాపు రూ.ఎనిమిది లక్షలు వరకూ ఖర్చవుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. ఇల్లు నిర్మించాలంటే ప్రభుత్వం ఇచ్చే సాయం కాకుండా మరో రూ.ఆరు లక్షలుపైన అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దమొత్తంలో అప్పు పుట్టే పరిస్థితి ఇళ్ల స్థలాల పొందిన లబ్ధిదారులకు లేదు. దీంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇల్లు కట్టకపోతే ఇంటి స్థలం వెనక్కి తీసుకుంటామని లబ్ధిదారులకు నోటీసులు వంటివి జారీ చేసినా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయం పెంచడం లేదు. దీంతో లబ్ధిదారులు అప్పు చేసి ఇల్లు కట్టేందుకు ససేమిరా అంటున్నారు. ప్రభుత్వం మాత్రం అన్నీ తామే ఇస్తున్నట్లు గొప్పలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. గృహప్రవేశాలకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం తేదీలు ప్రకటించడం వెనక్కి తగ్గడం పరిపాటిగా మారిపోయింది. ఇళ్ల నిర్మాణాలు అనుకున్న స్థాయిలో జరగకపోవడమే దీనికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి అందించే సాయం పెంచితే లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది.

ఎన్నికలకు సర్వం సిద్ధం

డిపిఒ శ్రీనివాసవిశ్వనాథ్
3 సర్పంచి, 21 వార్డులకు రేపు ఎన్నికలు
పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు
సర్పంచి, వార్డు సభ్యుల ఉప ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి, అడిషనల్ జిల్లా ఎన్నికల అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జిల్లాలో ఈ నెల 19న మూడు సర్పంచులకు, 21 వార్డు సభ్యులకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయని డిపిఒ తెలిపారు. 33 పోలింగ్ కేంద్రాల్లో జరగనున్న ఎన్నికల్లో 11,114 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వీరిలో పురుషులు 5444 కాగా 5670 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికలు జరగనున్న సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బందో బస్త్ పెంచడమే కాకుండా మైక్రో పరిశీలకులను నియమించామని, సుమారు 160 సిబ్బందిని వినియోగించనున్నామని డిపిఒ తెలిపారు. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, ఓటర్లు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ఎన్నికల పరిశీలకులకు చూపించాలన్నారు. ఇప్పటికే ఓటరు చీటీలను ప్రతిఓటరుకూ పంచామని, ఎన్నికలు సజావుగా జరగడానికి 48 గంటల ముందే ప్రచారం ముగించాలని, మద్యం దుకాణాలు మూసివేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహరా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించిన సామగ్రి మండల కేంద్రానికి చేరిందని ఎన్నికల ప్రవర్తన నియమావళిని సక్రమంగా అమలు చేస్తున్నామని, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్‌శాఖల సహకారంతో ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరగడానికి కలెక్టర్ సూచనలతో అన్ని చర్యలూ చేపట్టామన్నారు.


ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న డిపిఒ


జోరు వర్షంలో రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లు రద్దు చేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి - బుట్టాయగూడెం
గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూముల్లో ఇచ్చిన తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్స్‌ను తక్షణం రద్దు చేయాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మర్లగూడెం సమీపంలో గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని మర్లగూడెం సమీపంలోని గిరిజనులు 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్న ఎల్‌టిఆర్ 1/70 చట్ట భూముల్లో ఇరు గ్రూపుల రికార్డులను పరిశీలించకుండా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ప్రొటెక్షన్ ఇవ్వటాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. గతంలోని ఆర్‌డిఒ నాగేశ్వరరావు సమీక్షంలోని ఇరుగ్రూపుల రికార్డు వెరిఫికేషన్ చేశారని, ఆ భూములో 1970 తర్వాత అమ్మకాలు, కొనుగోలు జరగటంతో రికార్డులను గిరిజనేతరులు చూపించకపోవడంతో ఆనాటి నుండి స్థానిక గిరిజనులు భూములు సాగు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆర్‌డిఒ ఇరుగ్రూపులకు చెందిన రికార్డు వెరిఫికేషన్ చేయకుండా వన్‌సైడ్‌గా ఇవ్వటాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టారు. అక్రమంగా ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


రౌడీయిజాన్ని సిపిఎం సహించదు
మర్లగూడెం సమీపంలో గిరిజనుల సాగులో ఉన్న భూముల్లో కొంతమంది గిరిజనేతర భూస్వాములు తమ పలుకుబడితో బయట నుంచి కిరాయి జనాలను తీసుకొచ్చి గిరిజనులపై దౌర్జన్యం చేస్తున్నారని, దీనికి రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం డబ్బుకు అమ్ముడుపోయి గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్నారని, కొత్త సమస్యలకు కారణమవుతున్నారని దీన్ని తక్షణం నిలుపుదల చేయకపోతే ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజనుల సాగులో ఉన్న భూముల్లో పూర్తిస్థాయిలో టైటిల్ వెరిఫికేషన్ చేయాలని చట్టబద్ధంగా గిరిజన హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, చంద్రు బుల్లెమ్మ, గ్రామస్తులు దుర్గారావు, శ్రీదేవి, మడక వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్
నూజివీడు ట్రిపుల్ ఐటీలో పియుసి రెండో సంవత్సరం పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఇంజినీరింగ్ విభాగాల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా విభాగాల కేటాయింపు ఉంటుందని ఆయన తెలిపారు.

దోమ లార్వా సాంద్రతపై సర్వే

ప్రజాశక్తి - నూజివీడు రూరల్
నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీ, అమ్మవారితోట, రామాయమ్మారావుపేట ప్రాంతాల్లో గురువారం దోమ లార్వా సాంద్రతపై వైద్యసిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎలమంద మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, పుల కుండీలు, పాత టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్ల లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు.


నూజివీడులో డ్వాక్రా మహిళలకు డెమో చెక్కును అందిస్తున్న ఎంఎల్‌ఎ

సిఎం జగన్ మహిళా పక్షపాతి

ప్రజాశక్తి -ఆగిరిపల్లి
సిఎం జగన్ మహిళా పక్షపాతి అని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి జెడ్‌పిహెచ్ స్కూల్లో 1230 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి సున్నా వడ్డీ పథకం కింద మంజూరైన రూ.1,67,72,275 విలువైన డెమో చెక్కును ఆయన స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కర్‌రావు, ఎంపిడిఒ పి.శంకర్‌రావు, ఎపిఎం బి.రామకృష్ణ, ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, వైస్‌ఎంపిపి జి.సాంబశివరావు, పి.నరసింహారావు, ఎం.హరిబాబు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ మేక వెంకటప్రతాప్‌అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల బలోపేతానికి అధిక ప్రాధాన్యతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఎంఇఒను సన్మానిస్తున్న సిబ్బంది

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ద్వారా ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న ఎంఇఒ కె.శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం మండలంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండలంలో పలువురు ఉద్యోగులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌ఎన్‌డి పేటలో రక్త పింజరి హల్‌చల్

ప్రజాశక్తి - పోలవరం
ఎల్‌ఎన్‌డి పేటలోని మద్యం షాపు వద్ద రక్త పింజరి జాతికి చెందిన ప్రమాదకరమైన పాము హల్‌చల్ చేసింది. తొలుత పామును చూసిన కొందరు రబ్బరు పాము అనుకుని పట్టుకోబోయారు. అది కదలడంతో భయాందోళన చెందిన స్థానికులు అప్రమత్తమయ్యారు.



ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి : ఎంపీ కోటగిరి


ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రజాశక్తి - చింతలపూడి
దేశంలో ప్రజలకు రూ.2.50 కోట్ల టన్నుల ఆయిల్ అవసరమవుతుందని దీనిలో కోటీ 50 లక్షల టన్నుల ఆయిల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. చింతలపూడి మండలం సీతానగరం గోద్రేజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో జరిగిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ సాగు పెరుగుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తే మరింతమంది సాగు చేసేందుకు ముందుకువస్తారన్నారు. 40 లక్షల హెక్టార్లలో రైతులు పామాయిల్ సాగు చేయగలిగితే ఇతర దేశాల నుండి ఆయిల్‌ను దిగుమతి చేసుకునే అవసరం ఉండదని ఆయన తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే పామాయిల్ పంట అంతరించిపోతుందని ఇప్పటికే 25 సంవత్సరాలు పూర్తయిన పామాయిల్ మొక్కలను తొలగించి ఇతర పంటలకు రైతుల ముగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో పామాయిల్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ కమిషనర్ పికె.సింగ్, డైరెక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైసిపి లక్ష్యం

ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాచన్నగూడెం పంచాయతీలో ఎంఎల్‌ఎ పర్యటించారు. ఈ సందర్భంగా మారుమూల గ్రామాలైన లంకాలపల్లి, గోపాలపురం, తాటిరామన్నగూడెం గ్రామాల్లో ప్రతిగడపకూ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లుగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతీకుటుంబానికి జరిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు సమస్యలను ప్రజలు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబానికి రూ.పది వేలు ఆర్థిక సహాయం చేశారు.


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ప్రజలకు అందిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన ఎంఎల్‌ఎ
నిర్వాసితకాలనీ తాట్కూరుగొమ్ము కాలనీలో సుమారు రూ.70 లక్షల నిధులతో నూతన సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. అనంతరం రాచన్నగూడెం పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచి సున్నం వరలక్ష్మి, సచివాలయ కన్వీనర్ వనమా రామకృష్ణ, వైస్‌ఎంపిపి సోమగని శ్రీనివాస్, ఎంపిటిసి సున్నం సురేష్, బోధ శ్రీనివాస్, సందా ప్రసాద్, బోగేశ్వరరావు, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, ఎంఇఒ బుచ్చయ్య, మాజీ సర్పంచి కె.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కె.రాము, కుంజా రాముడు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు
తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రెడ్డిగూడెం గ్రామస్తులు గురువారం ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. మేడేపల్లి పంచాయతీ రెడ్డిగూడెంలో నెల రోజులుగా తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఖాళీబిందెలను ప్రధాన రహదారిపై పెట్టి జోరువానను సైతం లెక్కచేయకుండా ఎనిమిది గంటలు పాటు రాస్తారోకో చేశారు. ఈ ధర్నాకు సిపిఎం, సిపిఐ మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య మండల కార్యదర్శి కరాటం సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ నెల రోజులుగా తాగునీరు లేక అల్లాడుతూ తమ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో నీటి సమస్య ఉందన్నారు. అధికారులు స్థానికంగా ఉండకుండా దూర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తుంటే స్థానిక సమస్యలు ఎలా తెలుస్తాయని విమర్శించారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో మేడేపల్లి సర్పంచి కట్టం రాంబాబు, సచివాలయ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని 24 గంటల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిపిఐ మండల కార్యదర్శి బి.రాము, గ్రామస్తులు ఊకే వెంకమ్మ, కారం. కుమారి, రాణి, కరుణ, ముత్తమ్మ, దుర్గమ్మ, మంగమ్మ, లక్ష్మి, రమేష్, కామయ్య పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో అధికారికి వినతిని అందిస్తున్న మీటర్ రీడర్లు

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఈ ఏడాది జూలై నెల వేతనాలు తక్షణం చెల్లించాలని ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఇపిడిసిఎల్ ఎస్‌ఇ కార్యాలయంలో మీటర్ రీడర్లు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మీటర్ రీడర్లు అరకొర వేతనాలతో జీవిస్తున్నారని, అయినా ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డోర్ లాక్, మిస్ మ్యాచ్, ఇతర టెక్నికల్ కారణాలు సాకుగా చూపి ఇచ్చే వేతనంలో కూడా కోత విధిస్తున్నారని, ఫలితంగా మీటర్ రీడర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మీటర్ రీడర్లకు కాంట్రాక్టర్లు మొబైల్స్ ఇవ్వకుండా, రీఛార్జి చేయించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థల నిర్దేశించిన రేట్లు ఇవ్వకుండా దోచుకుంటున్నారని విమర్శించారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థల్లో మీటర్ రీడర్లు ఎనలేని సేవలందిస్తున్నారని, కానీ సంస్థ మాత్రం వారి పట్ల చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న మీటర్ రీడర్లకు వచ్చే ఆదాయం సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టే ఆలోచనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల తక్షణం జోక్యం చేసుకొని వారి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్వరరావు, జాకబ్, శ్రీనివాస్, మునికుమార్, రాజేష్, సువర్ణరాజు, పెద్దిరాజు, వంశీ ప్రసంగించారు.

కలెక్టర్‌ను కలిసిన కర్మచారీస్ జాతీయ కమిషన్ సభ్యులు వావా

ప్రజాశక్తి - ఏలూరు
ఏలూరు విచ్చేసిన సఫాయి కర్మచారీస్ జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి.వావాను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వావా మాట్లాడుతూ రాష్ట్రంలో సఫాయి కర్మచారిస్‌కు సంబంధించి మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. యువ కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం తన పర్యటనలో చూశానన్నారు. ప్రసన్న వెంకటేష్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని వావా కితాబు ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ అర్హులైన పేదలకు ఇళ్లు అందజేస్తున్నారని పిపి వావా అన్నారు. వీరితోపాటు కమిషన్ సామాజిక సలహాదారు గిరీంద్రనాథ్ ఉన్నారు.



వావాకు పూలమొక్కను అందిస్తున్న కలెక్టర్

కార్మిక చట్టాల అమల్లో వైసిపి విఫలం

ప్రజాశక్తి - నిడమర్రు

కార్మిక చట్టాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన ఇచ్చిన హామీని జగన్ నిలబెట్టుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం మోహన్‌రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారపల్లి రమణరావు మాట్లాడుతూ కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గ్రామరెవెన్యూ సహాయకులకు అమలు చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో నిరసనలు తెలియజేసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ నెల 25వ తేదీన నిర్వహించే చలో అమరావతిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, సిహెచ్.తులసీరామ్, ఎస్.దిలీప్, వానపల్లి శేషగిరిరావు, గవర సత్యనారాయణ పాల్గొన్నారు.

నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు జిల్లాస్థాయి శిక్షణా తరగతులను ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. ఈ తరగతుల్లో జిల్లాలోని అన్ని మండలాల ముఖ్య కార్యకర్తలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన సిఐటియు ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాల అమలు కోసం రానున్న కాలంలో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు నారపల్లి రమణరావు, వరప్రసాద్, లావేటి చంద్రావు, కోన శ్రీనివాసరావు, కమిలి నాని, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన పాల్గొన్నారు.


డాగ్యూరే విగ్రహాన్ని ఆవిష్కరించిన ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

లూయిస్ డాగ్యూరే విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక జెడ్‌పి హైస్కూల్ వద్ద మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్యూరే విగ్రహాన్ని ఫొటో, వీడియో గ్రాఫర్స్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు గురువారం ఆవిష్కరించారు. విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్‌ను వైసిపి మండల నాయకులు దేవరపల్లి సీతారాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ అందాలను కెమెరాలో బంధించి ఫొటో, వీడియోగ్రాఫర్లు ప్రపంచానికి అందిస్తున్నారన్నారు. ప్రకృతి అందాలతో పాటు మనిషి రూపాలను చిరస్థాయిగా నిలిపేలా కెమెరాను సృష్టించడం గొప్ప విషయమన్నారు. లూయిస్ డాగ్యూరేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ రాష్ట్ర సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు అమీర్ బాషా, మండల అధ్యక్షులు పల్లగాని ప్రసాద్, పి.భార్గవ్, మహా డిజిటాల్ మహారాజు, కె.సత్యనారాయణ, దాసరి బాబి పాల్గొన్నారు.

రిటైర్డ్ న్యాయమూర్తి జయకుమార్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్


జయకుమార్ (ఫైల్‌ఫొటో)

నూజివీడు పట్టణంలో రిటైర్డ్ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అమెరిశెట్టి జయకుమార్ (70) మృతికి పట్టణంలోని ప్రముఖులు సంతాపం తెలిపారు. రమణక్కపేట గ్రామానికి చెందిన జయకుమార్ న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగి స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్‌గా సేవలందించారని తెలిపారు. ఆయన మృతికి నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్, పలువురు న్యాయవాదులు సంతాపం తెలిపారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ముసునూరు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన ముసునూరు నేలపాటి వారికుంట ఏరియాలో ఎస్ఐ ఎం.కుటుంబరావు తమ సిబ్బందితో గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఏలూరు నగరానికి చెందిన ఒక యువకుడు, నూజివీడు పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు ఒకే బైకుపై మూడు కేజీల 250 గ్రాముల గంజాయి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వారిని చాకచక్యంగా పట్టుకుని సిఐ అంకబాబు ఆధ్వర్యంలో విచారణ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


ప్రమాద స్థలంలో ఆర్‌టిసి, టాటా మ్యాజిక్

టాటా మ్యాజిక్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాలకు వెళ్లిన విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లేందుకు స్కూలు వద్దకు వెళ్తున్న టాటా మ్యాజిక్‌ను ఆర్‌టిసి బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటన ముదినేపల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి గుడివాడ వెళ్తున్న గుడివాడ డిపోకు చెందిన ఆర్‌టిసి పాసింజర్ బస్సు స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెయ్యేరు కాలనీ వద్ద బస్సు ముందు వెళ్తున్న టాటా మ్యాజిక్‌ను ఢీ కొట్టింది. దీంతో టాటా మ్యాజిక్ వెనుక భాగం దెబ్బతింది. ఆ సమయంలో టాటా మ్యాజిక్‌లో విద్యార్థులు లేరు. విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లేందుకు టాటా మ్యాజిక్ స్కూల్ వద్దకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనతో టాటా మ్యాజిక్ డ్రైవర్‌కు, ఆర్‌టిసి డ్రైవర్‌కు మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దారి తీసింది. ఎట్టకేలకు టాటా మ్యాజిక్ డ్రైవర్‌కు ఆర్‌టిసి బస్సు డ్రైవర్ నష్టపరిహారం ఇవ్వడంతో ఘర్షణ సద్దుమణిగి ఎవరి దారిన వారు వెళ్లారు.


దుకాణంలోకి దూసుకెళ్లిన ట్యాంకర్ లారీ

దుకాణంలోకి దూసుకెళ్లిన ట్యాంకర్ లారీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరంలో ఓ దుకాణంలోకి ట్యాంకర్ లారీ దూసుకెళ్లింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో ట్యాంకర్ లారీ అదుపుతప్పి రహదారి పక్కన వ్యాపార దుకాణంలోకి దూసుకుపోయిందని స్థానికుల తెలిపారు. దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దుకాణంతో పాటు ఫ్రిజ్‌లు, సామగ్రి ధ్వంసమైంది.

జిల్లాలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు భేష్

సంతృప్తి వ్యక్తం చేసిన సఫాయి కర్మచారీస్ జాతీయ కమిషన్ సభ్యులు వావా

కలెక్టర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని కితాబు


ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు విచ్చేసిన సఫాయి కర్మ చారీస్ జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావాను జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి డాక్టర్ పి.పి.వావా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.పి.వావా మాట్లాడుతూ రాష్ట్రంలో సఫాయి కర్మచారీస్‌కు సంబంధించి మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. యువ కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడం తన పర్యటనలో చూశానని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమర్థవంతంగా పని చేస్తున్నారని పి.పి.వావా కితాబు ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ అర్హులైన పేదలకు ఇళ్లు అందిస్తున్నారని చెప్పారు. వీరితో పాటు కమిషన్ సామాజిక సలహాదారు గిరీంద్రనాథ్ ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి.పి.వావా

జిల్లా ఉత్తమ వ్యవసాయ శాఖాధికారిగా ఉషారాణి


సత్కారం అందుకుంటున్న ఉషారాణి

ప్రజాశక్తి - భీమడోలు

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుని భీమడోలు వ్యవసాయ అధికారి సూరిశెట్టి పద్మజ వీర ఉషారాణి జిల్లాస్థాయిలో ఉత్తమ వ్యవసాయ శాఖ అధికారిగా ఎంపికయ్యారు. భీమడోలు మండల పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేలైన యాజమాన్య పద్ధతుల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహణ, ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు భీమడోలు మండలంలో ముంపునకు గురైన వ్యవసాయ క్షేత్రాల్లో నిల్వ ఉన్న నీటిని తరలించేందుకు సమస్యను తొలుత స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు, అనంతరం సంయుక్త సంచాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. ముంపు బెడదను తప్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పైరు సంరక్షణ చర్యలు చేపట్టినందుకు, ధాన్యం కొనుగోళ్ల, చెల్లింపులు రైతులకు సకాలంలో అందించేందుకు తగు చర్యలు తీసుకోవడంతో పాటు రైతు భరోసా కేంద్రం ద్వారా చేపట్టే వివిధ కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగేందుకు సహకరించినందుకు జిల్లాస్థాయిలో ఉత్తమ వ్యవసాయ అధికారిగా ఎన్నికయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. భీమడోలు వ్యవసాయ అధికారిగా రెండేళ్ల క్రితం బాధ్యతలను చేపట్టిన ఉషారాణి 2012లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురం, ఉప్పలగుప్పం, మామిడికుదురులలో పనిచేసి బదిలీపై భీమడోలు వచ్చారు. ఈ మేరకు భీమడోలులోని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారితో పాటు మండల పరిధిలోని గ్రామ సచివాలయాలకు చెందిన వ్యవసాయ సహాయకులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.


22 వరకు మానవత సంస్థ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయిలో ముగింపు కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీన గణపవరంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షులు, సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా భీమడోలులోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ సునీత ,మత్తు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని తోపాటు భీమడోలు మండలానికి చెందిన సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా మాజీ అధ్యక్షులు మాట్లాడుతూ మానవత సంస్థ ఆవిర్భావం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగు తాయన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ మానవత శాఖల ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నా మన్నారు. భీమడోలు మండలంలో నిర్వహించే కార్యక్ర మాల్లో భాగంగా 19వ తేదీన భీమడోలులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి సునీత మాన్సింగ్ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. ఈ నెల 21వ తేదీన పూళ్ల గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం వంతెన వద్ద మానవహారాన్ని ఏర్పాటుచేసి సంస్థకు సంఘీభావాన్ని తెలియజేస్తారన్నారు. కార్యక్రమానికి భీమడోలు సిఐ వెంకటేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరిం చారు. 22వ తేదీన గణపవరంలో నిర్వహించే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా పరిధిలోని 31 మండలాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యులు చింతా శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.


రోగులకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న వైద్యులు, మానవత ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం : ఈ నెల 22వ తేదీన మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని మండలాలు, జిల్లాల్లో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా రక్త నిధి ఛైర్మన్ రమణమూర్తి, జిల్లా మెంబర్ రంగప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణ మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కేదారేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా మానవత శాంతి ర్యాలీలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గద్దె సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, కమ్యూనిటీ హాల్ కన్వీనర్ కృష్ణమూర్తి, గోపాలకృష్ణ, పల్లి వెంకటరెడ్డి, అప్పారావు, సూర్య, ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


భాస్కరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

భాస్కరరావు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మున్సిపల్ మాజీ ఛైర్మన్ బసవ భాస్కరరావు విగ్రహాన్ని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు గురువారం ఆవిష్కరించారు. పట్టణంలోని కష్ణ బడ్డీ కొట్టు సెంటర్‌లో భాస్కరరావు విగ్రహాన్ని ఆయన కుటుంబసభ్యులు ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంఎల్ఎ వెంకటప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ నూజివీడు పట్టణానికి భాస్కరరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : ఎపియుడబ్ల్యూజె

ప్రజాశక్తి - చింతలపూడి


రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎపియుడబ్ల్యూజె నిరంతరం పోరాడుతుందని జిల్లా కార్యవర్గ సభ్యుడు, చింతలపూడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కె.అజాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చింతలపూడిలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అజాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు అలిని జర్నలిస్టులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం ప్రింట్ మీడియా అధ్యక్షుడు లతీఫ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి కిషోర్, సీనియర్ పాత్రికేయులు ఎస్‌కె.అమీర్ పాషా, కె.వీరయ్య, జిన్నా, సూరిబాబు, రవి, ముత్తేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానంతో గుండె పదిలం : డిఎస్‌పి

జంగారెడ్డిగూడెం :రక్తదానంతో గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చని, ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల గుండె పదిలంగా ఉంటుందని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ఎం.ధనుంజయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఎపియుడబ్ల్యూజె) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ భవనంలలో ఎపియుడబ్ల్యూజె సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ధనుంజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ధనుంజయుడు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అలుగు ఆనందశేఖర్, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ మాట్లాడారు. శిబిరంలో రక్తదానం చేసిన జర్నలిస్టులకు, విద్యార్థులకు డిఎస్‌పి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం డిఎస్‌పిని సత్కరించారు.

ఓటును వృథా చేయొద్దు

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ


నూతన కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ


ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమైనదని, దాన్ని వృథా చేయొద్దని, నిజాయితీపరులకు ఓటు వేసి ఎన్నుకోవాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సూచించారు. ఆగిరిపల్లిలోని యుటిఎఫ్ భవనంలో జరిగిన యుటిఎఫ్ మండల జనరల్ కౌన్సెల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఆన్‌లైన్ సభ్యత్వం పూర్తిచేసుకుని తొలి మండల కౌన్సిల్ ఎన్నికలు జరుపుకుంటున్న ఆగిరిపల్లి యుటిఎఫ్ శాఖకు ఆయన అభినందనలు తెలిపారు. ఆగిరిపల్లి యుటిఎఫ్ భవనానికి యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి అక్కినేని కృష్ణ సుందరరావు పేరుపెట్టడం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి మరో ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. అనంతరం మండల యుటిఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పామర్తి కృష్ణ, కలపాల అజరయ్య, గౌరవఅధ్యక్షులుగా బత్తుల జీవరత్నం, కోశాధికారిగా సతీష్, ఉపాధ్యక్షులుగా అంజనాదేవి, రాకేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జ్ఞానసుందరం, అపర్ణ, రామచంద్రన్, పాపారావు, కిశోర్, రవికుమార్ పాల్గొన్నారు.

కళాశాలకు రూ.2.7 లక్షల విలువైన ఫర్నీచర్

పజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, సిపిడిసి సభ్యుల ద్వారా కళాశాలలో మౌలిక వసతుల కొరత గురించి తెలుసుకున్న ఏలూరు శాంతినగర్ నివాసి విశ్రాంత ఇంజినీర్, సంఘ సేవకులు చందన విష్ణువర్ధనరావు తనవంతుగా విద్యార్థుల సౌకర్యార్థం రూ.2.7 లక్షల విలువైన 30 డెస్కులను కళాశాలకు గురువారం అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు, అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎం.కృష్ణ చైతన్య, టివి దుర్గాప్రసాద్, చందన విష్ణువర్ధన్‌రావుకు కృతజ్ఞతాపూర్వకంగా జ్ఞాపికను అందించి శాలువాతో సన్మానించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ దాత ఔదార్యాన్ని, ఉన్నత వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ మరింత మంది దాతలు కళాశాల అభివృద్ధి కోసం తోడ్పడగలరన్నారు. డిగ్రీ కళాశాల ఫర్నీచర్ అవసరాన్ని చెప్పిన వెంటనే స్పందించి తన సహకారాన్ని అందించిన చందన విష్ణువర్ధన్‌రావును సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు కొనియాడారు. సిపిడిసి కార్యదర్శి ఇ.రఘుబాబు హర్షం వ్యక్తం చేశారు.


విష్ణువర్ధన్‌రావును సత్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు, గోసంరక్షణకు విరాళాలు


ఇఒ త్రినాధరావుకు విరాళాలు అందిస్తున్న కిషోర్‌బాబు, వాణి దంపతులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు, గో సంరక్షణ పథకానికి బాతుల కిషోర్‌బాబు, వాణి దంపతులు విరాళాలు అందించారు. బాతుల కిషోర్ బాబు, వాణి దంపతుల కుమారుడు బాతుల ధీర పేరు న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.4,55,500, మనవడు ధృవ పేరున గో సంరక్షణ పథకానికి రూ.4,55,500 చెక్కుల రూపంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావుకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్ అందించారు.

గోపవరంలో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గన్నవరం రోటరీ క్లబ్ వారు తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గన్నవరం రోటరీ క్లబ్, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ వారి సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ వైద్య సేవలు, బిపి, షుగరు, నేత్రాలు, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్య సేవలతో పాటు ఇసిజి కూడా తీయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి పాతూరు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - భీమడోలు

సీతంపేట-భీమడోలు రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న 358వ నెంబర్ పాతూరు రైల్వే గేటును డౌన్ ట్రాక్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 18వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ ఏలూరుకు చెందిన సీనియర్ సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. జాతీయ రహదారి నెంబర్ 5, నెంబర్ 216లను అనుసంధానం చేసే రోడ్డు మార్గం మధ్య ఉన్న పాతూరు రైల్వే గేట్ మీదుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, పశువుల పెంపకందారులు మరమ్మతులు పూర్తయ్యేంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ఆయన సూచించారు.

పొదుపుతో ఆర్థిక పరిపుష్టి సాధించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పొదుపుతో ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎపిఎం బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక క్రాంతి మహిళ మండలి సమైఖ్య కార్యాలయంలో గురువారం ఆర్థిక నిర్వహణపై విఒ పాలకవర్గ సభ్యులకు, వెలుగు మిత్రలకు, బుక్ కీపర్లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల మహిళ సమైఖ్య అధ్యక్షురాలు కె.కల్యాణి, ఎల్‌సి రవికుమార్, సిసిలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఎస్ఐ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీలో ఐదో వార్డు సభ్యుడు ఎన్నికకు ఈ నెల 19వ తేదీన ఉప ఎన్నిక నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌ను రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ గురువారం పరిశీలించారు. పోలింగ్ బూత్ పరిసరాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్న పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు సహకరించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు.


బాధితునికి సాయం అందిస్తున్న వినోద్

అనారోగ్య బాధితునికి వినోద్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి నియోజకవర్గ నాయకులు కొడాలి వినోద్ గురువారం సాయం అందించారు. మండలంలోని గురజ గ్రామానికి చెందిన పట్నల మురళి రెండు కిడ్నీలు చెడిపోయాయి. చికిత్స నిమిత్తం డాక్టర్లను సంప్రదిస్తే ఆరోగ్యశ్రీ వర్తించదని వైద్యులు చెప్పారు. వైద్య చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేక ఇంట్లోనే ఉంటూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. విషయం తెలుసుకున్న వినోద్ వెంటనే గురజ వెళ్లి మురళిని పరామర్శించి తనవంతు సాయంగా రూ.15 వేలు అందించారు. వినోద్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

సేవలు మరింత విస్తృతం

వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్రామరాజు

భీమవరం రూరల్ : దేశవ్యాప్తంగా విద్య, వైద్య తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న తమ ఫౌండేషన్ భవిష్యత్తులో రాష్ట్రంలో మరింత విస్తృతం చేస్తామని వసుధ ఫార్మా స్యూటికల్ అధినేత, వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన వెంకట్రామరాజు అన్నారు. వసుధ ఫౌండేషన్, శ్రీలక్ష్మీ గాయత్రి హాస్పిటల్ (హైదరాబాద్) వారి సహకారంతో భీమవరం మెంటేవారితోటలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రాన్ని బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట రామరాజు మాట్లాడుతూ పేదవారిని ఆదుకోవాలన్న సంకల్పంతో ఫౌండేషన్‌ను ప్రారంభించామన్నారు. నేడు వైద్య, విద్య సేవా కార్యక్రమాలతో పాటు పేదలు, వృద్ధుల జీవనానికి సహకారం అందిస్తున్నామన్నారు. విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బలరాం, ఉద్దరాజు రామం ట్రస్ట్ ఛైర్మన్ మంతెన సీతారాంతో ఆయన చర్చించారు. సీతారాం మాట్లాడుతూ గిరిజనులకు సహాయ సహకారాలు అందించడానికి అల్లూరి సీతారామరాజు ఆదివాసి కేంద్రంను ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేశామన్నారు. వసుధ వెంకట్రామరాజు మాట్లాడుతూ పోలవరం, భద్రాచలం తదితర ప్రాంతాల్లో తమ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ పొనమండ చంద్రశేఖరవర్మ, వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్ రాజు, మానవత సభ్యులు పాల్గొన్నారు.